



దండేపల్లిలో జీపీ నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీపీ భాస్కర్, ఏసీపీ, ఎంపీడీవో

పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రెండో సాధారణ పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని ఆదేశించారు. బుధవారం హైద్రాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రిజర్వేషన్లు, పోలింగ్ కేంద్రాలు, జియో లొకేషన్ టీ పోల్ పోర్టల్‌లో నమోదు చేయాలని, పోర్టల్‌లో గ్రీవెన్స్ ప్లాట్‌ఫామ్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. దరఖాస్తులు, ఫిర్యాదుల పరిష్కారానికి నోడల్ అధికారిని నియమించి ఫిర్యాదులను మూడు రోజుల్లోగా పరిష్కరించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియామవళిని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో వెలుతురు, తాగునీరు, విద్యుత్, ర్యాంప్, వెబ్ కాస్టింగ్, సీసీ కెమెరాలను ఇతర సౌకర్యాలను కల్పించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్‌లను కౌంటింగ్‌కు మూడు రోజుల ముందుగా సిద్ధం చేయాలని, పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, ఆర్డీవో శ్రీనివాసరావు, నోడల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నామినేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

రెండో సాధారణ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో నామినేషన్ల ప్రక్రియ సజావుగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. కలెక్టరేట్ సమీకృత భవన సమావేశంలో మందిరంలో నిర్వహించిన రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు నామినేషన్ల ప్రక్రియపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. ఎన్నికల నిర్వహణ కోసం అధికారులకు అవసరమైన శిక్షణ అందిస్తామన్నారు. నామినేషన్ ప్రక్రియ నుంచి ఎన్నికల ఫలితాలు ప్రకటించే వరకు ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల పరిశీలన, పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా, పోస్టల్ బ్యాలెట్ పంపిణీ, ఫొటో ఓటరు స్లిప్పుల పంపిణీ పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు, ఫలితాలు వంటి ప్రతీ అంశంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి అభ్యర్థి తప్పనిసరిగా బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించాలన్నారు. నామినేషన్‌ల పరిశీలన, ఓట్ల లెక్కింపు అంశాల్లో జాగ్రత్తగా వ్యవహరించాలని, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలన్నారు. ఎన్నికల గుర్తుల కేటాయింపులో జాగ్రత్తలు వహించాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అనుమానాలు, అపోహలు ఉన్నా శిక్షణ సమయంలో నివృత్తి చేసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు,నోడల్ అధికారి శంకర్ పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి పూజలు



పూజలు చేస్తున్న దేవాదాయ శాఖ ఉప కమిషనర్ గౌరీ శంకర్

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని విశ్వనాథ ఆలయంలో బుధవారం సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. వేద పండితులు నరహరి శర్మ, శ్రీకేష్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలకు ఆశీర్వచనాలు అందజేశారు. భక్తులు పూలు, పండ్లు, పాలతో అభిషేకం చేశారు.

- సుబ్రహ్మణ్య స్వామి షష్ఠిని పురస్కరించుకుని ఆరు జిల్లాల దేవాదాయ శాఖ ఉప కమిషనర్ గౌరీశంకర్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వహణ, భక్తుల సౌకర్యాలపై ఈవో రవిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ముక్త రవి, బాలకృష్ణశర్మ, శ్రీకేష్‌శర్మ, జనార్దన్, శ్రీనివాస్, ధర్మేందర్, రీణా పాల్గొన్నారు.

శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ స్వామి కల్యాణం




గూడెంలో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

దండేపల్లి: సుబ్రహ్మణ్య షష్ఠి పురస్కరించుకుని దండేపల్లి మండలం గూడెం అయ్యప్పస్వామి దేవస్థానంలో బుధవారం అంగరంగ వైభవంగా శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణస్వామి కల్యాణం వేద మంత్రోచ్ఛరణల మధ్య కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు, గురుస్వామి శ్రీమాన్ చక్రవర్తుల పురుషోత్తమచార్యులు ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయంలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణస్వామికి ప్రత్యేక పూజలు, హోమం, నిర్వహించారు. అనంతరం ఆలయంలో అయ్యప్ప భక్తులు భజన చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వామి భక్తులు, శాశ్వత అన్నదాన సేవ ట్రస్ట్ సభ్యులు, దీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు.

జనరల్ స్థానాల్లో బీసీలకు అవకాశం

- పార్టీ పరంగా ఇచ్చేందుకు కాంగ్రెస్ కసరత్తు
- మంత్రివర్గ నిర్ణయంతో చిగురిస్తున్న ఆశలు
- సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో వర్తింపు
- ప్రతిపక్ష పార్టీల నిర్ణయంపైనా గ్రామాల్లో ఆసక్తి



మంచిర్యాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ అటు ప్రభుత్వంతోపాటు ఇటు రాజకీయ పార్టీల్లోనూ కాక రేపుతోంది. హైకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికలకు వెళ్లక తప్పని పరిస్థితులు నెలకొనడంతో బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ముందుగా నిర్ణయించినట్లు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అధికారికంగా అమలు చేయడం కష్టసాధ్యమైన నేపథ్యంలో...కనీసం పార్టీ పరంగా నైనా అవకాశం కల్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించినట్లు సమాచారం. దీంతో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఆశావహుల్లో సమీకరణాలు మారే అవకాశాలు అధికంగా ఉన్నాయి. దీంతో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల్లో బరిలో నిలవాలనే ఆలోచనతో ఉన్న ఆశావహులు తమ ఆలోచన సరళిని మార్చుకుంటున్నారు.

రిజర్వేషన్ల నిబంధనలతో..

సుప్రీం కోర్టు గైడ్ లైన్స్ ఆధారంగా అన్ని కేటగిరీల రిజర్వేషన్లు 50 శాతానికి మించి ఉండకూడదన్న నిబంధన ఉంది. రాష్ట్రంలో చేపట్టిన సమగ్ర కులగణన సర్వే ప్రకారం బీసీలు 50 శాతానికి పైగా ఉండటంతో, జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం బీసీ సామాజిక వర్గానికి చెందిన వారికి 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించి ఉండరాదన్న సుప్రీం కోర్టు నిర్ణయంతో ప్రభుత్వం పునరాలోచనలో పడింది. ఈ నేపథ్యంలో బీసీలకు స్థానికసంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం, ప్రస్తుతం దిద్దుబాటు చర్యలకు దిగుతోంది. కనీసం పార్టీ పరంగానైనా బీసీ లకు ముందుగా నిర్ణయించిన ప్రకారం రిజర్వేషన్ సౌకర్యం కల్పించేందుకు రెండు రోజుల క్రితం రేవంత్ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఈ మేరకు జనరల్ కేటగిరి కింద కేటాయించిన మొత్తం నుంచి బీసీలకు అవకాశం కల్పించాలని నిర్ణయించారు.

జనరల్‌కు 44.8 శాతం సీట్లు...

జిల్లాలోని 306 గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఇప్పటికే షెడ్యూల్ విడుదలైంది. వాటిలో ఏజెన్సీ పంచాయతీలు 36 ఉండగా, నాన్ ఏజెన్సీ కింద మరో 268 గ్రామపంచాయతీలు ఉన్నాయి. అలాగే ప్రత్యేకంగా షెడ్యూల్ ట్రైబ్ జీపీలు మూడు ఉన్నాయి. వాటిలో ఎస్టీలకు 21.2 శాతం మేరకు మొత్తం 65 సీట్లు కేటాయించారు.

అలాగే ఎస్సీలకు 26.5 శాతంతో 81 స్థానాలు, బీసీలకు 7.5 శాతంతో 23 సీట్లు కేటాయించారు. వాటికి అదనంగా అన్ రిజర్వుడ్ కోటాలో 44.8 శాతంతో 137 సీట్లు కేటాయించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెనుకబడ్డ కులస్థులకు ఇచ్చిన హామీ మేరకు అన్‌రిజర్వు కోటా నుంచి సీట్లు కేటాయించేందుకు నిర్ణయం తీసుకున్నారు. సర్పంచ్ స్థానాల్లో 137 సీట్లు అన్ రిజర్వ్‌డ్ విభాగాలకు కేటాయించడంతో వాటిలో సింహభాగం బీసీలకే ఇచ్చేలా నియోజకవర్గాల వారీగా ఆదేశాలు జారీ అయినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ లెక్కన బీసీలకు రిజర్వు చేసిన 23 సీట్లతోపాటు అన్ రిజర్వ్‌డ్ కోటా నుంచి మరో 19 స్థానాలను పార్టీ పరంగా వెనుకబడ్డ కులాలకు ఇస్తారనే ప్రచారం జరుగుతోంది. తద్వారా..

(మిగతా 7లో..)

పోలింగ్ కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

డీసీపీ ఎగ్గడి భాస్కర్

దండేపల్లి నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గురువారం నుంచి ప్రారంభం కానున్న నామినేషన్ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని లింగాపూర్, నెల్కి వెంకటాపూర్, దండేపల్లి గ్రామాల్లోని గ్రామ పంచాయతీ నామినేషన్ కేంద్రాలను మంచిర్యాల ఏసీపీ ప్రకాష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ ఆవరణ, నామినేషన్ స్వీకరణ కేంద్రాలను పరిశీలించారు. నామినేషన్ స్వీకరణ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులు, పోలీసు సిబ్బందికి సూచించారు. నామినేషన్‌కు వచ్చే అభ్యర్థితో పాటు మరో ఇద్దరు సహాయకులను మాత్రమే నామినేషన్ కేంద్రంలోకి అనుమతించాలని సూచించారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నామినేషన్ కేంద్రాలవద్ద పార్కింగ్ సమస్యలు లేకుండా తగిన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డీసీపీ వెంట ఎంపీడీవో జేఆర్ ప్రసాద్, సీఐ రమణమూర్తి, పంచాయతీ కార్యదర్శి శ్రీలత, పోలీసు సిబ్బంది ఉన్నారు.

గ్రామాల్లో మొదలైన ఎన్నికల కోలాహలం

మందమర్రిరూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల కోలాహలం మొదలైంది. మండలంలో 10 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. మండలంలో మూడవ విడత జరిగే ఎన్నికల్లో పది సర్పంచు స్థానాలకు, 86 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. డిసెంబరు 3 నుంచి నామినేషన్‌ల పర్వం మొదలు కానుంది. గ్రామాల్లో ఆశావాహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. ఎవరికి వారు తమ ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

ప్రజావాణి రద్దు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):రెండవ సాధారణ పంచాయతీ ఎన్నికల దృష్ట్యా ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి నిర్వహించే వివరాలను తెలియజేస్తామని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

వంట గదిని పరిశీలించి.. విద్యార్థులతో భోజనం చేసి..

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న రమాదేవి

బెల్లంపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి సూచించారు. బుధవారం బెల్లంపల్లిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆశ్రమ పాఠశాలలోని వంటగదిని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆశ్రమ పాఠశాలలో నాణ్యమైన భోజనం అందిస్తున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు పాఠశాలలో మెరుగైన వసతులతో పాటు ఉత్తమ ఫలితాల కోసం శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అజ్మీర నర్సింహా, అధ్యాపకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతి

నస్పూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని నిరసిస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం నస్పూర్‌లోని సీసీసీ కార్నర్ వద్ద నాయకులు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ హక్కుల పోరాటసమితి నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నాగరాజు, నాయకులు కిరణ్, చంద్రమౌళి, సతీష్, అంజయ్య పాల్గొన్నారు.

ధాన్యాన్ని తూర్పారా పట్టాలి

హాజీపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యాన్ని రైతులు తూర్పాల పట్టాలని డీపీఎం సారయ్య సూచించారు. 'ఆంధ్రజ్యోతి'లో దినపత్రికలో 'ధాన్యం కొనుగోళ్లపై మిల్లర్ల కొర్రీలు' అనే శీర్షికన మంగళవారం వార్త ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. నర్సింగాపూర్‌లోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. 40కిలోల సంచికి 42కిలోల పావు జోకిన కానీ మిల్లరు లారీ లోడ్‌కు ఆరు బస్తాలు కోత విధించడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో అధికారులు ధాన్యాన్ని ప్యాడ్ క్లీనర్ ద్వారా తూర్పాల పట్టిన తర్వాత తూకం వేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకన్న, ఏవో కృష్ణ పాల్గొన్నారు.

కొత్త ఆలోచనలకు పదును పెట్టాలి





విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, విద్యార్థులు చేసిన ఎగ్జిబిట్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ కుమార్ దీపక్
- ప్రారంభమైన వైజ్ఞానిక ప్రదర్శన

నస్పూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రోజు రోజుకు సాంకేతికపరంగా అనేక మార్పులు వస్తు న్నాయని, వాటికి అనుగుణంగా కొత్త ఆలోచనలకు పదును పెట్టాలని విద్యార్థులకు కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. నస్పూర్ పట్టణం సీసీసీలో 53వ జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్‌స్పైర్ అవార్డ్ మనక్ జిల్లా స్థాయి ప్రదర్శన-ప్రాజెక్ట్ కాంపిటీషన్ బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. జిల్లా విద్యాధికారి యాదయ్య, జిల్లా సైన్స్ అధికారి రాజాగోపాల్‌లతో కలిసి కలెక్టర్ కుమార్ దీపక్ జ్యోతి ప్రజ్వలనచేసి ప్రదర్శనలను ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్స్‌ను పరిశీలించి వాటికి సంబంధించి ప్రశ్నలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచి కొత్త కొత్త ఆలోచనలపై దృష్టిసారించి సాంకేతిక రంగంలో ఎదగాల న్నారు. రోజురోజుకు సాంకేతిక పరంగా అనేక మార్పులు వస్తున్నాయని, వాటికి అనుగుణంగా కొత్త ఆలోచనలకు పదును పెట్టాలన్నారు. గతంలో ఆర్వో ప్లాంట్ పెట్టుకోవాలంటే ఖర్చుతో కూడుకుందని, కానీ ప్రస్తుతం అదే ఇంటింటికి చేరిందన్నారు. సమాజంలోని సమస్యల పరిష్కారానికి మార్గం సైన్స్ చూపిస్తుందని, అది సృజనాత్మక ఆలోచనల తోనే సాధ్యమవుతుందని కలెక్టర్ అన్నారు. సాంకేతిక రంగం అభివృద్ధి చెందుతుందని, ఈ నేపథ్యంలో కొత్త ఆవిష్కరణల ద్వారా ప్రతీ రంగం అభివృద్ధి అంచెలంచెలుగా జరుగుతుందన్నారు. ప్రపంచం ఆధునిక సాంకేతికత వైపు పరుగెడుతుందని, విద్యార్థులు సైన్స్‌లో ప్రతీ అంశాన్ని క్షుణంగా అధ్యయనం చేసి తెలుసుకోవాలని సూచించారు. అంతకు ముందు విద్యార్థులు కలెక్టర్ కుమార్ దీపక్‌కు నృత్యంతో స్వాగతం పలికారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. సమావేశంలో నస్పూర్ మండల విద్యాధికారి పద్మజా, అధికారులు, ట్రస్మా నాయకులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



మంచిర్యాలలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్ డిమాండ్ చేశారు. బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. దేశంలో పరిశ్రమల అధిపతుల కోసం చట్ట సవరణలను కేంద్రం చేస్తోందన్నారు. 44 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వానికి కార్మికుల సంక్షేమం కంటే వ్యాపారుల క్షేమమే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు మేకల దాసు, కలీందర్ అలీఖాన్, పౌలు, సాంబయ్య, బ్రహ్మానందం, మంగ, మల్లన్న, జ్యోతి, శ్రీకాంత్, వెంకటస్వామి, దేవదాస్, రాజేశం, సంజీవ్, సురేష్, విశ్వనాథ్, సుమన్, కమల్, లక్ష్మీనారాయణ, రాజమౌళిప్రసాద్, కుమార్ పాల్గొన్నారు.

గెలుపు గుర్రాల వేట



- అభ్యర్థుల ఎంపికపై పార్టీల సర్వేలు
- పార్టీ నేతలతో సమాలోచనలు
- స్థానిక ఎన్నికలను సవాల్‌గా తీసుకుంటున్న ప్రధాన పార్టీలు

బెల్లంపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో పల్లెల్లో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఇప్పటికే రిజర్వేషన్లు ఖరారు కావడంతో గెలుపుగుర్రాల వేటలో ప్రధాన పార్టీలు అన్వేషణ మొదలుపెట్టాయి. స్థానిక ఎన్నికలను కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. సర్పంచ్ వార్డు మెంబర్ల రిజర్వేషన్లు, ఆయా సామాజిక వర్గాల బలాబలాలకు అనుగుణంగా గెలుపు గుర్రాల ఎంపికపై పార్టీల నేతలు అందరితో సమాలోచనలు, వ్యూహరచన మొదలుపెట్టారు. రిజర్వేషన్ల ఆధారంగా ఎవరెవరు పోటీలో ఉంటారనే దానిపై ఆశావహుల పేర్లను ఆయా పార్టీల మండల అధ్యక్షులు సేకరించి ముఖ్య నేతలతో చర్చిస్తున్నారు.

ఎక్కడ చూసినా ఎన్నికల ముచ్చట్లే...

పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఇన్నాళ్లు ప్రశాంతంగా ఉన్న పల్లె వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఎక్కడ చూసినా ఏ గ్రామ పంచాయతీ ఏ రిజర్వేషన్ వచ్చింది...? మన మనిషి ఎవరు, ఎవరు పోటీలు ఉంటున్నారు...? అనే మాటలే వినిపిస్తున్నాయి. పార్టీలను పక్కనపెట్టి ఆశావహుల వ్యక్తిగత చరిష్మా గతంలో గ్రామానికి చేసిన సేవల గురించి ప్రధాన పార్టీల నాయకులు ఆరా తీస్తున్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల కోసం జరిగే హోరాహోరీ పోరులో సామాజికవర్గం ధన ప్రధాన అస్త్రాలుగా మారనున్నట్లు తెలుస్తోంది.

పట్టుబిగించేది ఎవరో...

పల్లెలపై పట్టు సాధించేందుకు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్, బీజేపీలు వ్యూహాలకు పదునుపెడుతున్నాయి. పార్టీ గుర్తులపై ఎన్నికలు జరుగకపోయినా తమ కార్యకర్తలను ఎన్నికల్లో గెలిపించాలనే లక్ష్యంతో కసరత్తు ముమ్మరం చేస్తున్నాయి. కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే పంచాయతీ ఎన్నికల్లో తాము బలపరిచిన అభ్యర్థుల విజయానికి దోహదపడతాయని ఆ పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని స్థానిక ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు బీఆర్‌ఎస్‌కు బలంగా మారుతుందని ఆ పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు.

డిపెండెంట్ సర్టిఫికెట్ల జారీలో జాప్యంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కాగజ్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ రెవెన్యూ కార్యాలయంలో డిపెండెంట్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియలో జరుగుతున్న జాప్యంలో కలెక్టర్‌కు బుధవారం మాజీ కౌన్సిలర్ బాల్యశ్యాం ఫిర్యాదు చేశారు. రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తులు చేసి ఏడాది గడుస్తున్నా కూడా ఇంత వరకు డిపెండెంట్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని చెప్పారు. అధికారులు కాలయాపన చేస్తుండడంతో దరఖాస్తుదారులు అవస్థలు పడుతున్నారని అన్నారు. ఆర్‌ఐ విచారణ చేసినప్పటికీ కూడా పెండింగ్‌లో పెట్టడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు డిపెండెంట్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆయన కోరారు.

పెండింగ్ స్కాలర్ షిప్ విడుదల చేయాలి

కెరమెరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దీపక్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా సంజన, ఉపాధ్యక్షుడిగా రాందాస్, సహాయ కార్యదర్శిగా జగదీష్, కోశాధికారిగా వెన్నెలతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన ఆత్మ చైర్మన్

కాగజ్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మెల్సీ నివాసంలో బుధవారం ఆత్మచైర్మన్ తాళ్లపల్లి రామారావు ఎమ్మెల్సీ దండే విఠల్‌ను మార్యదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆత్మ చైర్మన్‌తో పాటు సభ్యులను ఎమ్మెల్సీ సన్మానించారు.

మూల మలుపులు.. తరుచూ ప్రమాదాలు



వాంకిడి మండలంలో ప్రమాదకరంగా మూల మలుపు

హెచ్చరిక బోర్డుల ఏర్పాటుపై నిర్లక్ష్యం

రాకపోకలకు వాహనదారుల అవస్థలు

జైనూర్/సిర్పూర్(యు)/లింగాపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీల మండలాల పరిధిలో పలు గ్రామాలకు వెళ్లే రాహదారుల్లో ఉన్న మూల మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. దీంతో పాటు పిచ్చి మొక్కలు, పొదలు, విపరీతంగా పెరిగిపోయి దారులను కమ్మేస్తుండడంతో తరుచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఎటువంటి హెచ్చరిక బోర్డులు, సూచికలు లేకపోవడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలను ఢీ కొని గాయపడుతున్నారు. మలుపుల కారణంగా దగ్గరికి వచ్చే వరకు వాహనాలు ఒక దానికొకటి కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇరు వైపులా పొదలు కూడా కారణమని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు బ్లాక్ స్పాట్లుగా గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు ముళ్ల పొదలను తొలగించాలని కోరుతున్నారు.

సిర్పూర్(యు) మండలంలో..

సిర్పూర్(యు) మండలంలో పాములవాడ నుంచి బాండియేర్ వరకు వెళ్లే మార్గంలో కొద్దిగూడ



జామ్ని సడక్‌గూడ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మూల మలుపు

గ్రామ శివారులో, సిర్పూర్(యు) మండల కేంద్రం నుంచి దేవుడ్‌పెల్లి మార్గంలో పంగిడి నుంచి పెద్ద దోబ వెళ్లే క్రమంలో కాకడ్ బొడ్డి సమీపంలో, సేవాదాస్ నగర్ గ్రామ సమీపంలో ఉన్న మలుపు వద్ద గత ఏడాది ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు. జైనూరు మండలంలో జామ్ని నుంచి పంగిడి వెళ్లే క్రమంలో పొలాస తండా వద్ద, ఉషేగాం నుంచి పట్నాపూర్, జండా గూడ గ్రామాల మార్గంలో.. అంద్‌గూడ నుంచి కెరమెరి మండలంలోని మలంగీ గ్రామానికి వెళ్లే మార్గంలో.. లింగాపూర్ మండల కేంద్ర నుంచి లొద్దిగూడ మీదుగా తిర్యాణి వెళ్లే మార్గంలో.. గోపాల్‌పూర్, రామునాయక్ తండా, పూల్‌సింగ్‌నాయక్ గ్రామాల సమీపంలో ఉన్న మలుపులు, ఇదే మండలంలోని జాములధర నుంచి మారుగూడ వెళ్లే మార్గంలో మూడు మలుపులు ఉన్నాయి. మామిడిపెల్లి నుంచి పిక్లా తండా వెళ్లే మార్గంలో.. మండల కేంద్రంలో కస్తూర్బా పాఠశాల సమీపంలో, భుసిమెట్ట క్యాంప్ ఘాట్ అటవీ మార్గాన కెరమెరి వైపు వెళ్లే మార్గంలో సుమారు పదికి పైగా మూలమలుపులు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్సీ వసతి గృహం ఎదురుగా..

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండల కేంద్రం నుంచి ధాబా వెళ్లె రహదారిపై ఎస్సీ వసతి గృహం ఎదురుగా ఉన్న మూల మలుపుతో పాటు ఖమన గ్రామ సమీపంలో గల మూల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి.

వాంకిడి మండల కేంద్రం నుంచి సవ్వాతి, ధాబా, నవేధరి, చిచ్‌పల్లి, బండకాసా, డొడ్డిగుడ, తదితర గ్రామాలకు వాహనదారులు పనులు నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. ఎస్సీ వసతి గృహం ఎదురుగా ఉన్న మూలమలుపు వద్ద ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మూలమలుపుల వద్ద చెట్ల కొమ్ములు వాలి ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు, ప్రజలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు. ఖమన గ్రామ సమీపంలో ఉన్న మూల మలుపులు సైతం ప్రమాదాలకు నిలయంగా మారాయి. వాంకిడి మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు ఈ రోడ్డు ద్వారానే కాగజ్‌నగర్‌కు ప్రతి రోజు రాకపోకలు సాగిస్తుంటారు. మూల మలుపుల వద్ద ఏలాంటి ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. గత ఏడాది ఖమన నుంచి కాగజ్‌నగర్ వరకు బిటీ రోడ్డును నిర్మించిన సదరు కాంట్రాక్టర్ మూలమ లుపుల వద్ద ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చే యలేదు. ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దీక్షా దివస్‌కు తరలిరావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కంద్రంలో ఈ నెల 29న నిర్వహించనున్న దీక్షా దివస్‌కు తరలిరావాలని ఎమ్మెల్యే కోవలక్ష్మి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, నియోజక వర్గ నాయకులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ నెల 29న ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కోసం కేసీఆర్ చేపట్టిన దీక్షకు 16 ఏళ్లు అవుతున్న సందర్భంగా 29న దీక్షా దివాస్ నిర్వహిస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్ అహ్మద్, అజయ్‌కుమార్, ఇంతియాజ్ లాలా, నిసార్, అయ్యూబ్, బలరాం, నాయక్, నేపాజీ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

రెబ్బెన, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని ఏరియా జీఎంకు ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ నాయకులు బుధవారం వినతి పత్రం అందజేశారు. పాత చట్టాలనే అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు తిరుపతి, మొగిలి, శేషుశైనారావు, జగ్గయ్య, శ్రీనివాస్, రారాజు, అంజయయ, మంగీలాల్, వెంకటేష్, మహేందర్‌రెడ్డి, వెంకటేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

మంచిర్యాల క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) మంచిర్యాల పట్టణం పాత మంచిర్యాలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన కంబాల రాజేష్(32) అనే యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 23వ తేదీ ఆదివారం రాజేష్ భార్య సౌందర్య, కూతురు ఆద్విక, కుమారుడు మన్వర్షిత్‌లో కలిసి ద్విచక్ర వాహనంపై లక్షెట్టిపేటలో వివాహానికి హాజరయ్యారు. తిరిగి వస్తుండగా పాత మంచిర్యాలలో ఎదురుగా వస్తున్న గుడిపేటకు చెందిన దుర్గం సంతోష్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై వస్తూ ఢీకొట్టాడు. దీంతో రాజేష్, కూతురు ఆద్వికలకు తీవ్రగాయాలు కాగా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజేష్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్య చికిత్స కోసం కరీంనగర్ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్న క్రమంలో బుధవారం మృతి చెందాడు. మంచిర్యాల ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో సింగరేణి కార్మికుడి మృతి

రామకృష్ణాపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్ పరిధిలోని గద్దెరాగడి ఆర్‌ఆర్ నగర్‌కు చెందిన చెరుకు కృష్ణమూర్తి(55) సింగరేణి కార్మికుడు గుండెపోటుతో ఇంట్లో మరణించాడు. మృతుడి భార్య సువర్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 25న రాత్రివిధులు ముగించుకొని వస్తుండగా ఎడమచేతి నుంచి గుండెవరకు నొప్పి వస్తుందని తెలిపాడన్నారు. ఉదయం స్నానం చేయడానికి వెళ్లి ఎంత సేపటికి రాకపోవడంతో చూసేసరికి కిందపడి ఉండడంతో 108 ద్వారా మంచిర్యాల ఆసుపత్రికి తీసుకెళ్లడంతో పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ వెంకన్న తెలిపారు.

పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పాల్గొన్న అధికారులు

ఆసిఫాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రెండో సాధారణ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీసీ హాల్ నుంచి బుధవారం అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణతో కలిసి జూమ్ మీటింగ్ ద్వారా మొదటి విడత మండలాలు అయిన లింగాపూర్, సిర్పూర్(యూ), జైనూరు, కెర మెరి, వాంకిడి మండలాల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, జిల్లాలోని తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, ఎస్సైలు, ఫ్లయింగ్ స్టాటస్టిక్ సర్వేయలెన్స్ బృందాల సభ్యులతో నామినేషన్ ప్రక్రియ, ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడతలో ఐదు మండలాల్లోని సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్ల స్వీకరణ కోసం 27 కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతీ నామినేషన్ స్వీకరణ కేంద్రానికి రిటర్నింగ్, సహాయ రిటర్నింగ అధికారి ఉంటారని తెలిపారు. ఈ నెల 27 ఉదయం 10.30 గంటల ముందే ఫారం 1 నోటీసు, ఫొటో ఓటర్ల జాబితా, స్థానాల వివరాలను నామినేష్ స్వీకరణ కేంద్రం వద్ద ప్రదర్శించాలని తెలిపారు. ఈ నెల 27 నుంచి 29 వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించాలని చెప్పారు. ఈ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు ఉండకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. నామినేషన్ పరిశఋలన, తుది జాబితా, గుర్తుల కేటాయింపు పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీసు సమన్వయంతో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. స్టాటిస్టిక్, ఫ్లయింగ్ సర్వేయలెన్స్ బృందాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మూడు విడతల ఎన్నికలు పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమావేశంలో స్టేజ్ -1 రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




శిక్షకుల ఎంపికకు ఇంటర్వ్యూ

శ్రీరాంపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి సేవా సమితి ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను వివిధ వృత్తి కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన శిక్షకుల ఎంపికకు బుధవారం జీఎం కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ మాట్లాడుతూ ఇంటర్వ్యూలకు శ్రీరాంపూర్ రియా పరిసర ప్రాంతాలకు చెందిన 29 మంది మహిళలు హాజరయ్యారని అన్నారు. వృత్తి అంశాల్లో అనుభవం, నైపుణ్యం, అర్హతల ఆధారంగా శిక్షకులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఏజీఎం(ఫైనాన్స్) సుమలత, డీజీఎం(పర్సనల్) అనిల్‌కుమార్, సీనియర్ పీవో సురేందర్, ఫైనాన్స్ అధికారి పద్మ, ఐఈడీ అధికారి సంగీత పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు అమలు చేయొద్దు

శ్రీరాంపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను సింగరేణిలో అమలు చేయవద్దని హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు వి అనిల్ రెడ్డి, కార్యదర్శి పొనగంటి అశోక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. . 2019-20 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్పు చేసిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు.

కొత్త చట్టాలతో కార్మికులకు ప్రయోజనం



మాట్లాడుతున్న బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్రం తీసుకొచ్చిన కొత్త చట్టాలతో కార్మికులకు ప్రయోజనం కలుగుతుందని సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్(బీఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చడం వెనుక కార్మికులకు విస్తృత ప్రయోజనం దాగుం దన్నారు. ఈ చట్టాలు కార్మికుల హక్కుల రక్షణకు, సంస్థలను కాపాడేం దుకు, పరిశ్రమల ప్రగతికి, దేశ అభివృద్ధికి ఉపయోగపడతాయన్నారు. కార్మికుల ప్రయోజనాల దృష్ట్యా ఆయా కోడ్లను తాము స్వాగతిస్తున్నామన్నారు. సమావేశంలో ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి, ఏరియా కార్యదర్శి రాగం రాజేందర్, కార్యకర్తలు బోయిన మల్లేష్, జల్ల తిరుపతి, రాజారాం కిరణ్, దుపంల శ్రీధర్, రామకృష్ణ, కొమ్మ బాపు, మిట్టపల్లి మొగిలి, శేఖర్ యాదవ్, నీరటి సురేష్, గోళ్ల మహేందర్, పాల్గొన్నారు.

పౌరులు రాజ్యాంగాన్ని అనుసరించాలి



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతీ పౌరుడు రాజ్యాంగాన్ని అనుసరించాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జీఎం కార్యాలయం ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి రాజ్యాంగ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగా దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు హృద యం వంటిదని, ప్రతీ పౌరుడు తన హక్కులను కాపాడుకుం టూనే బాధ్యతలను నెరవేర్చాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, పిట్ కార్యదర్శి సందీప్, అధికారుల సంఘం అధ్యక్షుడు కె. వెంకటే శ్వర్‌రెడ్డి, ఏజీఎం (ఫైనాన్స్) సుమలత, డీజీఎం అనిల్ కుమార్, పర్చేజ్ అధికారి చంద్రశే ఖర్, ఎస్టేట్స్ అధికారి మహేష్, ఆర్ అండ్ డీ అధికారి అమర్‌నా థ్ రెడ్డి, లా అధికారి మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): గోలేటిలోని సింగరేణి జీఎం కార్యాలయ ఆవరణలో బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జీఎం విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత విలువ గల ప్రజా జీవన విధానం, శాంతియుత ప్రజాస్వామ్య దేశంగా భారత్ పేర్కొందడానికి మన రాజ్యాగమే కారణమన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయలు బాబా, అధికారుల సంఘం ప్రతినిధి ఉజ్వల్ కుమార్ బెహారా, ఏరియా ఇంజనీర్ కృష్ణమూర్తి, ఎస్‌ఓటు జీఎం రాజమల్లు, పర్సనల్ డిపార్టుమెంట్ హెచ్‌ఓడీ శ్రీనివాస్, పర్సనల్ అధికారి ప్రశాంత్, జీఎం కార్యలయం అదికారులు పాల్గొన్నారు.

జైపూర్, (ఆంధ్రజ్యోతి): ఎస్టీపీపీలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అతిధిగా ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి హాజ రయ్యారు. అధికారులు, ఉద్యోగులు భారత రాజ్యాంగ పీఠికను చదివి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మదన్‌మోహన్, పంతుల, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ సత్యనారాయణ, సంతోష్‌కుమార్, కిరణ్ బాబు, అజాజుల్లాఖాన్, శ్రీహరి పాల్గొన్నారు.

39 మంది ఉద్యోగులకు పదోన్నతి పత్రాలు అందజేత

శ్రీరాంపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆర్‌కే 7 గనికి చెందిన 39 మంది ఉద్యోగులకు గని మేనేజర్ తిరుపతి బుధవారం పదోన్నతి పత్రాలు అందించారు. 190 మస్టర్లు నిండిన బదిలీ వర్కర్ ఉద్యోగులకు జనరల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ, ఉత్పత్తి, రక్షణ రెండు కళ్లుగా భావించాలన్నారు. విధులకు క్రమం తప్పకుండా హాజరు కావాలని, సూచించారు. సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. విధులను నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు కొట్టి కిషన్ రావు, రక్షణాధికారి సంతోష్, పిట్ కార్యదర్శి మారెపల్లి సారయ్య, సంక్షేమాధికారి సంతన్, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్లతో హక్కులు కోల్పోయే ప్రమాదం

శ్రీరాంపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్లతో కార్మిక హక్కులు కోల్పోతారని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు అన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్, శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్‌కు వారు బుధవారం వినతిపత్రాలు ఇచ్చి నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరారు. కార్మికుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని కేంద్రం వెంటనే వీటిని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, ఐఎన్‌టీయూసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు, సీఐటీయూ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, సీఐటీయూ ఉపాధ్యక్షుడు గుల్ల బాలాజీ, ఐఎన్‌టీయూసీ నాయకులు సలేంద్ర సత్యనారాయణ, గరిగె స్వామి, తిరుపతి రాజు, రవీందర్ రెడ్డి, జీవన్ జోయల్, టీబీజీకేఎస్ నాయకులు బండి రమేష్, పానుగంటి సత్తయ్య, అన్వేష్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

మందమర్రిటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల అమలులోకి తెచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. జాతీయ రహదారి నుంచి జీఎం కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ధర్నాలో పాల్గొన్నవారిని ఉద్దేశించి అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు పూర్తిగా పారిశ్రామిక ప్రగతికి కార్మికుల ఉద్యోగ భద్రతకు పెను సవాల్‌గా మారాయని విమర్శించారు. వీటిని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు సలేంద్ర సత్యనారాయణ, కంది శ్రీనివాస్, ఇప్పకాయల లింగయ్య, ఎగ్గడి రాజేశ్వర్‌రావు, ముల్కలపల్లి వెంకటేశ్వర్లు, కాంపెల్లి సమ్మయ్య, దేవి భూమయ్య, బిక్షపతి, మేడిపల్లి సంపత్, బెల్లం అశోక్, ఎస్. వెంకటస్వామి, అల్లి రాజేందర్ పాల్గొన్నారు.

ఉత్పత్తిలో మేటిగా నిలవాలి

శ్రీరాంపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్‌లోని ఆర్‌కే 5 గని ఉత్పత్తిలో మేటిగా నిలవాలని ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. గనిపై బుధవారం ఉత్పత్తి, ఉత్పాదకతపై ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి ఉద్యోగి నిబద్ధతతో విధులు నిర్వర్తించినప్పుడే సంస్థ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆర్‌కే 5 గని 2.7 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉందన్నారు. అధికారులు ఆ దిశగా ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. ఉద్యోగుల గైర్హాజరు ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ప్రతి రోజు విధులకు హాజరు కావాలని సూచించారు. రోజువారీ లక్ష్యాన్ని చేరుకునేందుకు కష్టించి పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం(ఐఈడీ) రాజన్న, గ్రూప్ ఏజెంట్ శ్రీధర్, గని ఇన్‌చార్జి మేనేజర్ శివయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): డిసెంబరులో 56వ వార్షిక రక్షణ పక్షోత్సవాలు నిర్వహించనున్నామని శ్రీరాంపూం ఏరియా జీఎం ఎంమునిగంటి శ్రీనివాస్ అన్నారు. డిసెంబరులో నిర్వహిచనున్న వార్షిక ఉత్సవాలపై అన్ని గనులు, విభాగాల అధిపతులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ డిసెంబరు 8 నుంచి 19వ తేదీ వరకు శ్రీరాంపూర్ ఏరియాలో రక్షణ పక్షోత్సవాలు నిర్వహిస్తామన్నారు. గతంలో 19 బహుమతులు సాధించామని, ఈసారి కూడా అదే స్ఫూర్తితో అంతకుమించి బహుమతులు సాధించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, ఏరియా రక్షణాధికారి విజయ్ కుమార్, ఏజీఎం(ఫైనాన్స్) సుమలత, డీజీఎంలు అనిల్ కుమార్, ఆనంద్, రాజన్న, ఇందారం, శ్రీరాంపూర్ ఓసీపీల పీవో ఏవీ రెడ్డి, . వెంకటేశ్వర్లు, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్ పాల్గొన్నారు.

జనరల్ స్థానాల్లో బీసీలకు అవకాశం

(5వ పేజీ తరువాయి)

బీసీలకు ఇచ్చిన హామీ మేరకు మొత్తం 42 శాతం భర్తీ చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. అధికారికంగా 42 శాతం రిజర్వేషన్ కల్పించడంలో అడ్డంకులు ఎదురైనందున కనీసం పార్టీపరంగానైనా బీసీలకు న్యాయం చేసేలా కాంగ్రెస్ కార్యాచరణ ప్రారంభించినట్లు తెలుస్తోంది.

● **వార్డు స్థానాల్లోనూ..**

అదే మాదిరిగా వార్డు సభ్యుల స్థానాల్లోనూ అనధికారికంగా బీసీలకు రిజర్వేషన్లు కల్పించనున్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని 2,680 వార్డు స్థానాలకు గాను ఏజెన్సీ ఏరియాలో 204, నాన్ ఏజెన్సీ ఏరియాలో 2,452 స్థానాలు ఉండగా, వంద శాతం ఎస్టీ వార్డులు 24 ఉన్నాయి. మొత్తం వార్డుల సంఖ్యలో ఎస్సీలకు 17 శాతం రిజర్వేషన్ కింద 457 స్థానాలు, 22 శాతం రిజర్వేషన్‌తో ఎస్టీలకు 599, 12.4 శాతం రిజర్వేషన్‌తో బీసీలకు 334 స్థానాలు కేటాయించగా, 48.13 శాతంతో జనరల్ కేటగిరీకి 1290 సీట్లు రిజర్వ్ చేశారు. బీసీలకు ప్రత్యేకంగా కేటాయించిన 12.4 శాతానికి అదనంగా మరో 29.6 శాతం జనరల్ కోటా నుంచి రిజర్వ్ చేయడం ద్వారా మొత్తం ఆ సామాజిక వర్గానికి 42 శాతం రిజర్వేషన్లు పార్టీ పరంగా అమలు చేయనున్నట్లు సమాచారం. ఈ లెక్కన బీసీలకు వాస్తవ రిజర్వేషన్లు పోను అదనంగా మరో 900 పైచిలుకు సీట్లు కేటాయించేందుకు కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. అలా బీసీలకు ఇచ్చిన మాట ప్రకారం సీట్లు కేటాయించనున్నట్లు కాంగ్రెస్ పార్టీలో విస్తృతంగా చర్చ సాగుతోంది.

ఇదిలా ఉండగా ప్రతిపక్ష పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్‌లు పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి నిర్ణయం తీసుకుంటాయోనన్న ఉత్కంఠ ప్రస్తుతం ప్రజల్లో నెలకొంది. కాంగ్రెస్ మాదిరిగానే బీజేపీ, బీఆర్ఎస్‌లు కూడా పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట వేస్తాయా..? అన్న చర్చ జోరుగా సాగుతోంది. ఏంతో ఆ రెండు పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు సీట్ల కేటాయింపులో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. ఏదేమైనా బీసీల వరకు కాంగ్రెస్ నిర్ణయం తీసుకున్న పక్షంలో ఆ సామాజిక వర్గాల ప్రజల నుంచి వ్యతిరేకత తప్పదనే చర్చ సాగుతోంది.

కాంగ్రెస్ బలపరిచిన నాయకులనే ఎన్నుకోవాలి



మాట్లాడుతున్న భానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్

జన్నారం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులనే సర్పంచ్‌లుగా ఎన్నుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మండలంలోని 29 గ్రామపంచాయతీల్లో గడపగడపకు కాంగ్రెస్ నాయకులు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలన్నారు. కాంగ్రెస్ బలపరిచిన వారిని ఎన్నుకుంటే విధిగా కార్పొరేట్ల కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సుభాష్ రెడ్డి, ముజాహిద్ అలీ, అల్లం రవి, దుర్గం లక్ష్మీనారాయణ, దుమ్మల రంజిత్, మామిడిపల్లి ఇంద్రయ్య పాల్గొన్నారు.

వివాదాస్పద భూమి పరిశీలన

నెన్నెల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నెన్నెల శివారులోని సర్వే నంబరు 671-4, 672-11లో రెవెన్యూ అటవీ శాఖల మధ్య వివాదాస్పదంగా ఉన్న భూమిని బెల్లంపల్లి సబ్‌కలెక్టర్ మనోజ్ బుధవారం పరిశీలించారు. పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నప్పటికీ రైతులు పోడెస్తు పేరిట అటవీ అధికారులు సాగును అడ్డుకుంటున్నారని రైతులు కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు సబ్‌కలెక్టర్ వచ్చారు. రైతులతో మాట్లాడి వారి వద్ద ఉన్న పత్రాలను చూశారు. ఎప్పటి నుంచి పంటలు వేస్తున్నారు. ఏ పంట సాగుచేశారో తెలుసుకున్నారు. వ్యవసాయశాఖ అధికారుల నుంచి పంట నమోదు వివరాలు సేకరించి తెలుసుకుంటున్నారు. పోడెస్తు అధికారులను వివరణ కోరారు. పారెస్టు, రెవెన్యూ శాఖలతో సంయుక్త సర్వే చేపట్టి సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని సబ్‌కలెక్టర్ పేర్కొన్నారు. రేంజ్ అధికారి దయాకర్, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ సులోచన ఉన్నారు.

దివ్యాంగులకు 29న జిల్లా స్థాయి ఆటల పోటీలు

మంచిర్యాల క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగులకు జిల్లా స్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి రౌఫ్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న బాలుర హైస్కూల్ మైదానంలో నిర్వహిస్తున్నామని, ఆసక్తి గల దివ్యాంగులు ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. జిల్లాలోని దివ్యాంగులందరు 18 సంవత్సరాలలోపు బాలబాలికలకు, 18 నుండి 54 సంవత్సరాల మహిళలు, పురుషులకు వేరు వేరు విభాగాలలో ఆటల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. పోటీలలో పాల్గొనే దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, యూడీ ఐడీ, ఆధార్ కార్డును తీసుకురావాలని సూచించారు. అంధులకు రన్నింగ్, షాట్‌పుట్, చెస్, బధిరులకు రన్నింగ్, షాట్‌పుట్, జావెలింగ్ త్రో, శారీరక వైకల్యం గల వారికి షాట్‌పుట్, క్యారమ్స్, జావెలింగ్ త్రో, బుద్ధి మాంద్యం గల వారికి రన్నింగ్, షాట్‌పుట్ విభాగాల్లో పోటీలను నిర్వహిస్తామని, ఆసక్తి గల వారు పోటీలలో పాల్గొనాలని సూచించారు.


ఆశావహుల్లో ఖర్చుల గుబులు



- గ్రామాల్లో ఎన్నికల సందడి
- దావత్‌లు, మందు పార్టీలు షురూ
- చివరి విడత వారికి

తలకుమించిన భారం

నెన్నెల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది. ఎక్కడ విన్నా పదవుల చర్చే నడుస్తోంది. దావత్‌లు, మందు పార్టీలు ఊపందుకున్నాయి. ఆశావహులు ఖర్చు చేస్తున్నప్పటికీ వారికి డబ్బుల టెన్షన్ పట్టుకుంది. మూడు విడతల్లో సర్పంచ్ ఎన్నికలు జరుగనున్నాయి. మొదటి విడత జరిగే ఎన్నికల అభ్యర్థులకు ఖర్చులు కలిసి వస్తాయని, చివరి విడత అయితే అదనపు భారం మోయాల్సి వస్తుందని వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి నుంచి 20 రోజులకు పైగా ఎన్నికల ప్రచారంతో పాటు క్యాడర్‌ను కాపాడుకునేందుకు వారి కోరికలు తీర్చడం లాంటి ఖర్చులు భరించాల్సి ఉంటుంది. జనాన్ని ప్రభావితం చేసే పెద్దలను, కుల, మహిళా సంఘాలు, యూత్ లీడర్లను మచ్చిక చేసుకోవాల్సి ఉంటుంది. ఇది ప్రచార ఖర్చు మాత్రమే కాగా ఎన్నికలకు ఒక టి రెండు రోజుల ముందు ఓటర్లకు డబ్బు పంపిణీ చేయడం దీనికి అదన మని చెబుతున్నారు. ఎన్నికల ఖర్చుల అంచనా లెక్కలు చూసి ఆశావహులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎంత ఖర్చయినా సరేనంటూ డబ్బులు దారబోస్తే గెలువకపోతే ఎలా అనే భయం మరో వైపు కనబడుతోంది. ఏది ఏమైనా బరిలో నిలవాలంటే డబ్బు అవసరమే కాబట్టి సమకూర్చుకునే పనిలో పడ్డారు.



పరిమితికి మించి...

స్థానిక సంస్థల ఎన్నికల ఖర్చులకు ఎన్నికల కమిషన్ వ్యయపరిమితిని విధించింది. ఐదు వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీల్లో రూ. 2.50 లక్షలు, వార్డు సభ్యుడికి రూ. 50 వేలు, ఐదు వేల కంటే తక్కువ జనాభా ఉన్న జీపీల్లో సర్పంచ్‌కు రూ. 1.50 లక్షలు, వార్డు సభ్యుడు 30 వేల మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఎన్నికల అనంతరం ఖర్చులకు సంబంధించిన ఆధారాలతో సహా ఈసీకి సమర్పించాలి. అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై అధికారుల నిఘా ప్రతినిత్యం ఉంటుంది. ఎన్నికల వ్యయానికి ఈసీ విధించిన పరిమితులకు మించి ఏనిమిది నుంచి పది రెట్ల వరకు ఖర్చులు ఉంటాయనేది బహిరంగ రహస్యమే.

రిజర్వేషన్.. స్థానాన్ని బట్టి ఖర్చులు...

గ్రామ పంచాయతీ రిజర్వేషన్లను బట్టి ఎన్నికల ఖర్చులు మారనున్నాయి. జనరల్, బీసీ స్థానాల్లో ఖర్చు ఎక్కువ ఉండనుండగా, ఎస్సీ, ఎస్టీ స్థానాల్లో ఒకింత తక్కువ ఖర్చు ఉంటుంది. ఈసారి జనరల్ స్థానాలే ఎక్కువ ఉండటంతో ఆర్థికంగా బలంగా ఉన్నవారు పోటీ పడేందుకు సిద్ధపడుతున్నారు. ఈ పోటీకి పదవులు చేపట్టిన వారితో పాటు కొత్త వారు సైతం పోటీకి సై అంటున్నారు. గత ఎన్నికల్లోనే సర్పంచులుగా గెలిచేందుకు లక్షల్లో ఖర్చు చేయగా మళ్లీ ఈ ఎన్నికల్లో ఖర్చులు పెరిగే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మూడో విడత జీపీల్లో డబుల్ ఖర్చులు..

జిల్లాలో 306 గ్రామ పంచాయతీలు, 2,680 వార్డులున్నాయి. ఒకటో విడత డిసెంబరు 11న, రెండో విడత డిసెంబరు 14న, మూడో విడత డిసెంబరు 17న ఎన్నికలు నిర్వహించనున్నారు. పంచాయతీ ఎన్నికలు మొదటి విడతలో దండెపల్లి, హాజీపూర్, లక్సెట్టిపేట, జన్నారం రెండో విడతలో బెల్లంపల్లి, భీమిని, కన్నెపల్లి, కాసిపేట, నెన్నెల, తాండూరు, వేమనపల్లి, మూడో విడతలో భీమారం, చెన్నూరు, జైపూర్, కోటపల్లి, మందమర్రి మండలాల్లోని గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగనున్నాయి. మూడో విడతలో ఉన్న మండలాల జీపీల్లో ఆశావహులు ఇప్పటి నుంచి 20 రోజులకు పైగా ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. మొదటి విడత వారితో పోల్చుకుంటే వారి ఖర్చులు రెట్టింపు కానున్నాయి.

జాలరి వలకు చిక్కిన చిటాలా చేప



చేపను చూపిస్తున్న మత్స్యకారుడు

హాజీపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టులో బుధవారం జాలరి వలకు చిటాలా చేప చిక్కింది. గుడిపేటకు చెందిన మోహన్ అనే మత్స్యకారుడు చేపల కోసం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో వల కట్టగా అరుదైన చిటాల రకానికి చెందిన నాలుగు కిలోల చేప చిక్కింది. ఇది అరుదైన రకం చేప అని ఈ ప్రాజెక్టులో ఇప్పటి వరకు ఇలాంటి చేప లభ్యం కాలేదని, దీని ధర కిలోకు 800 రూపాయల వరకు ఉంటుందని మత్స్యకారులు చెబుతున్నారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తాం

దండేపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు కృషి చేస్తామని జిల్లా పర్యవేక్షణ ఇంజనీర్ (ఎస్ఈ) బి. రాజన్న అన్నారు. బుధవారం పర్యవేక్షణ ఇంజనీర్ పదోన్నతి బాధ్యతలు చేపట్టిన మొదటిసారి దండేపల్లి విద్యుత్ సెక్షన్ వచ్చిన సందర్భంగా సెక్షన్ సిబ్బంది పుష్ప గుచ్ఛాలు అందజేసి శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ బాపు, సబ్ ఇంజనీర్ సాయినరేష్ ఎస్ఎల్‌ఐ నర్సయ్య పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

భీమారం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రంలోని మైసమ్మ వాడలోని పూజ కిరాణం షాపులో సోమవారం బుధవారం సాయంత్రం గుడుంబాను పట్టుకున్నట్లు భీమారం ఎస్ఐ శ్వేత తెలిపారు. గుడుంబా ఉందని సమాచారం రావడంతో కిరాణం షాపులో తనిఖీలు చేయగా ఐదు లీటర్ల గుడుంబా లభ్యమైందన్నారు. కిరాణం షాపు యాజమాని భుక్య పూజపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా గుడుంబా, మద్యం అమ్మితే చర్యలుంటాయని తెలిపారు.

ఆకట్టుకున్న పోతరాజు వేషధారణ

దండేపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి విద్యా శిక్షణలో మండలంలోని గుడిరేవు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బోలిశెట్టి బుచ్చన్న పోతరాజు వేషధారణ ఆకట్టుకుంది. ఈనెల 19 నుంచి ఢిల్లీలో జాతీయస్థాయి విద్య శిక్షణ కొనసాగుతుండగా వివిధ రాష్ట్రాలకు చెందిన ఉపాధ్యాయులు శిక్షణకు ఎంపికయ్యారు. తెలంగాణ నుంచి బోలిశెట్టి బుచ్చన్న శిక్షణకు ఎంపికయ్యారు. బుధవారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తెలంగాణ సంస్కృతికి చెందిన బోనాల పండుగలో విశిష్ట ఆదరణ ఉన్న పోతరాజు వేషధారణతో నిర్వహకులను ఆకట్టుకున్నాడు. తెలంగాణ గ్రామ చరిత్ర, వారసత్వ సంపద, కళలు, సంస్కృతి, విద్య అభివృద్ధిపై బుచ్చన్న ప్రజెంటేషన్ చేశాడు. దీంతో అక్కడి నిర్వహకులు బుచ్చన్నను అభినందించారు.

నిందితుడి అరెస్టు

మందమర్రిటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామన్‌కాలనీ ప్రసన్నాంజనేయ ఆలయంలో రెండు రోజుల క్రితం దొంగతనానికి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. కంది రవి అనే వ్యక్తి ఆలయంలో అర్ధరాత్రి హుండీని పగులకొట్టి అందులో నుంచి డబ్బులు దొంగిలించాడని తెలిపారు. తెల్లవారుజామున ఆలయానికి వచ్చిన పూజారి హుండీలు పగులకొట్టి ఉండడం గమనించి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నిందితుడిని బుధవారం మండలంలో టోల్‌గేట్ వద్ద పట్టుకున్నామన్నారు. ఇతడు రవి రెబ్బెన మండలం గోలేటి టౌన్‌షిప్‌కు చెందిన వ్యక్తి అని సింగరేణి ఉద్యోగానికి గైర్హాజరవుతూ మద్యానికి బానిసై జల్సాల కోసం దొంగతనాలు చేస్తున్నాడన్నారు. అతని వద్ద నుంచి 2,450 రూపాయలను రికవరీ చేశామని, ఇంక ఎక్కడైన పాల్పడ్డాడనే విషయాన్ని ఆరా తీస్తున్నామన్నారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన కానిస్టేబుళ్లను ఆయన అభినందించారు.

ఇందన్‌పల్లి అటవీ ప్రాంతంలో పులి సంచారం

జన్నారం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇందన్‌పల్లి అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తోందని అడవిలోని ఎనిమీలో పులి ఆవుపై దాడి చేసి చంపిందని ఇందన్‌పల్లి రేంజ్ అధికారి ఎఫ్ఆర్ఓ లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. సమీప అటవీ ప్రాంతంలోకి ఒంటరిగా తిరగవద్దని, పశువులు మేపేందుకు పశువుల కాపరులు అడవిలోకి వెళ్లవద్దని హెచ్చరించారు. వేట కోసం కరెంటు వైర్లు పంటల చుట్టూ ఉచ్చులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంటకు నష్టం వాటిల్లినా, పశుసంపదకు ఏమైనా జరిగినా నష్టపరిహారం అందజేస్తామని తెలిపారు.

మొదటి విడత సర్పంచ్ ఎన్నికలు షురూ

- నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ..
- 90 సర్పంచ్.. 816 వార్డు స్థానాలు

హాజీపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తొలివిడత గ్రామపంచాయతీ ఎన్నికల పర్వం నేటి నుంచి ప్రారంభం కానుంది. నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుండగా ఇందుకు సంబంధించి నామినేషన్ స్వీకరణ కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పంచాయతీ పోరులో భాగంగా మొదటి విడతలో జన్నారం, హాజీపూర్, దండేపల్లి, లక్సెట్టిపేట మండలాల్లోని 90 సర్పంచ్, 816 వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు స్వీకరించనున్నారు. క్లస్టర్ వారీగా పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను తహసీల్దార్లతో పాటు ఎంపీడీవోలు, డీఎల్పీవోలు, కార్యదర్శులు, పోలీస్ శాఖాధికారులు సందర్శించి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయించారు.

హాజీపూర్ మండలంలో..

హాజీపూర్ మండలంలో 12 గ్రామ పంచాయతీలు ఉండగా నాలుగు క్లస్టర్లుగా విభజించారు. మొదటి క్లస్టర్ గుడిపేట్, ర్యాలీ, నాగారం, చిన్నగోపాలపూర్ పంచాయతీల నామినేషన్లు గుడిపేట్ గ్రామ పంచాయతీలో, 2వ క్లస్టర్ హాజీపూర్ రాపల్లి, హాజీపూర్, టీకానపల్లి గ్రామాల నామినేషన్లను హాజీపూర్ పంచాయతీలో స్వీకరిస్తారు. మూడో క్లస్టర్ దొనబండ, పెద్దంపేట గ్రామాల నామినేషన్లు, నాలుగో క్లస్టర్ కర్ణమామిడిలో కర్ణమామిడి, వడ్డనపల్లి గ్రామాల నామినేషన్లను కర్ణమామిడి గ్రామపంచాయతీ కార్యాలయంలో స్వీకరిస్తారు. మండలంలో 12 సర్పంచ్ స్థానాలతో పాటు 106 వార్డు సభ్యుల స్థానాలకు గాను నామినేషన్లను స్వీకరించనున్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న దివాకర్‌రావు

లక్సెట్టిపేట, నవంబరు, 26(ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి గెలుపే దిశగా ప్రతీ ఒక్క నాయకుడు కార్యకర్త పనిచేయాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలో సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో దండేపల్లి, లక్సెట్టిపేట మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో విఫలం అయ్యిందని ఈ విషయం గ్రామాల్లో ప్రజలకు తెలియజేయాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు చుంచు చిన్నయ్య, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ తిప్పని లింగన్న, నాయకులు విజితరావు, అంకతి రమేష్, పసర్తి అనిల్, గంగాధర్ ఉన్నారు.

హాజీపూర్: మండలంలో పార్టీ ముఖ్య నాయకులతో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు సన్నాహక సమావేశం నిర్వహించారు.

ప్రియుడి ఇంటిఎదుట ప్రియురాలి నిరసన

కాసిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోమగూడెం భరత్ కాలనీకి చెందిన ప్రియుడు ఎస్కే సలీం ఇంటి ఎదుట బుధవారం ఓ గ్రామానికి చెందిన యువతి బైఠాయించి నిరసన తెలిపింది. ఈ సందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ ప్రేమ పేరుతో సలీం ఎనిమిదేళ్ల నుంచి శారీరకంగా వాడుకున్నాడని, పెళ్లి చేసుకోవాలని అడగడంతో ముఖం చాటేశాడన్నారు. ఇప్పుడు వేరే అమ్మాయితో పెళ్లికి సిద్ధమయ్యాడని తెలిపింది. ఈ ఏడాది ఆగస్టు నెలలో ప్రేమ పేరుతో మోసం చేశాడని స్థానిక కాసిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, దీంతో సలీంపై అట్రాసిటీ, అత్యాచారం, చీటింగ్ కేసు నమోదైందని, 45 రోజులు జైలు శిక్ష కూడా అనుభవించాడని తెలిపింది. ఈ నెల 29న మరో అమ్మాయితో పెళ్లి జరగనుండని తెలియడంతో సలీం ఇంటి ఎదుట బైఠాయించినట్లు తెలిపింది. ప్రేమ పేరుతో మోసం చేసిన సలీంతోనే తన వివాహం జరిగేంత వరకు నిరసన కొనసాగిస్తానని తెలిపింది. అనుమాన సంఘాల మహిళ సంఘాలు మద్దతు పలికి సంఘీభావం ప్రకటించారు.

విషయం తెలుసుకున్న ఎస్ఐ రవీందర్ సంఘటన స్థలానికి చేరుకుని ఎలాంటి ఘటనలు జరగకుండా భద్రత చర్యలు చేపట్టారు. బాధితురాలకు న్యాయస్థానం ప్రత్యేం చేసినప్పటికీ వివిధం చుకోవడంతో రెండువర్గాల కుటుంబసభ్యులను మందమర్రి సీఐ కార్యాలయానికి తరలించారు. సీఐ శశిధర్‌రెడ్డి రెండు వర్గాల కుటుంబాలతో పాటు సలీం, యువతికి కౌన్సిలింగ్ నిర్వహించి వివాదంతో యువతి ఆందోళన విరమించినట్లు తెలిపారు.


శాంతి భద్రతల పరిరక్షణ పోలీసుల బాధ్యత

లక్సెట్టిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణే పోలీసుల బాధ్యత అన్న విషయం ప్రతీ ఒక్క పోలీసు గుర్తుంచుకోవాలని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శనివారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంచిర్యాల డివిజన్ పోలీస్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ప్రతీ పోలీసు ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా చేపట్టాలన్నారు. ఎన్నికలు శాంతియుతంగా జరిగేగా పోలీసుల అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల నియమ నిబంధనలను పాటిస్తూ ప్రతీ పోలింగ్ బూత్ వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల సమయంలో పోలీసులు చేయాల్సిన పనులు, చేయకూడని పనులపై అవగాహన కల్పించి సలహాలు సూచనలు అందజేశారు. ఏసీపీ ప్రకాష్, మంచిర్యాల లక్సెట్టిపేట, నస్పూర్ సీఐ లు ప్రమోద్‌కుమార్, రమణమూర్తి, ఆకుల అశోక్, నరేష్‌కుమార్ ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

లక్సెట్టిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట మండలం జెండావెంకటాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 15లక్సెట్టిపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో ఏమునీషా ఆర్యా టి శ్రీహిత అనే ఇద్దరు విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. ఈనెల 26 నుంచి పెద్దపల్లి జిల్లా నందిమేడారంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు హెచ్ఎం యశోధర బుధవారం తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను హెచ్ఎంతో పాటు పీడీ శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఇసుక డంప్



ఇందారంలో డంప్ చేసిన ఇసుక


జైపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఇసుక దోపిడీ కొనసాగుతోంది. మండలంలోని ఇందారం, జైపూర్ గ్రామాలకు చెందిన ట్రాక్టర్ యజమానులు ఇందారం గోదావరి ఇసుక రీచ్ నుంచి ఇసుకను తరలిస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు. ఇందారం గ్రామానికి చెందిన కొంతమంది ట్రాక్టర్ యజమానులు ఇదే అదునుగా భావించి ట్రాక్టర్ల ద్వారా ఇందారం గ్రామశివారులో ఇసుకను డంప్ చేసి రాత్రికి రాత్రి పొరుగు జిల్లాలకు లారీల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. జైపూర్‌కు చెందిన కొంతమంది ట్రాక్టర్ యజమానులు ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఎన్టీపీసీ వద్ద ఓ కాంట్రాక్టర్ వర్కర్ల కోసం నిర్మిస్తున్న షెడ్ల నిర్మాణాలకు ఇసుకను రవాణా చేస్తున్నట్లు సమాచారం. కొంత మంది ట్రాక్టర్ యజమానులు ఇసుకను ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం కాకుండా ఇతర ప్రైవేటు కట్టడాల కోసం ఇసుకను విక్రయిస్తున్నారు. ఇసుక తరలింపు నకు పంచాయతీ, రెవెన్యూ శాఖల అధికారులకు ఒక్కో ఇంటి నిర్మాణం కోసం ఎనిమిది ట్రాక్టర్ల ట్రిప్పుల ఇసుకను తరలించేలా నిబంధనలు విధించింది. అనుమతులు పొందిన ట్రాక్టర్ యజమానులు ఇష్టారాజ్యంగా ఇసుకను తరలిస్తూ అధికధరలకు ఇతరులకు విక్రయిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మించుకునే లబ్దిదారులకు తక్కువ ధరకు ఇసుక ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం స్థానికంగా ఉండే కొంత మంది ట్రాక్టర్ యజమానులకు అనుమతులు ఇచ్చింది. కానీ కొంత మంది ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుకను సరఫరా చేస్తున్నామని కార్యదర్శుల దగ్గర చీటీలు తీసుకుని ఇందారం శివారులో ఇసుకను డంప్ చేసి రాత్రికి రాత్రి లారీల ద్వారా పొరుగు జిల్లాలకు తరలిస్తున్నారు. అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

మెగా ఓసీపీతో మరింత భవిష్యత్

రామకృష్ణాపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఓసీపీ విస్తరణలో భాగంగా ఆర్కే పీ మెగా ఓసీపీ పేజ్-2 వల్ల రామకృష్ణాపూర్‌కు మరింత భవిష్యత్ ఉంటుందని మందమర్రి జీఎం రాధాకృష్ణ అన్నారు. ఆర్కే ఓసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. డిసెంబర్ 3న ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలంతా ప్రభుత్వం సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం ప్రసాద్, డీజీఎం పర్సనల్ అశోక్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఇన్విరాన్‌మెంట్ అధికారి వెంకటేశ్వర్లు, సెక్యూరిటీ అధికారి రవికుమార్, ఆర్కే ఓసీపీ మేనేజర్ పంకజ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత





మంచిర్యాలలో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రఘునాథ్ వెరబెల్లి, బీజేపీ నాయకులు, మందమర్రిలో మున్సిపల్ కమిషనర్ రాజలింగు, అధికారులు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్, నాయకులు దుర్గం అశోక్, పట్టి వెంకటకృష్ణ, కృష్ణమూర్తి, శ్రీధర్, అమిరిశెట్టి రాజ్‌కుమార్, శ్రీశైలం, జయరామారావు, మురళీ, చక్రవర్తి, సత్యనారాయణ, పొలా తదితరులు పాల్గొన్నారు.

● కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో నిర్వహించిన వేడుకల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి జిల్లా పెద్దపల్లి కలెక్టర్ అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు, డీఆర్డీవో కిషన్, జిల్లా సంక్షేమాధికారి రౌఫ్‌ఖాన్, డీఎంహెచ్‌వో అనిత, జిల్లా మైనార్టీ అధికారి రాజేశ్వరి, అధికారులు పాల్గొన్నారు.

మంచిర్యాల క్రైం: మంచిర్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సాయికుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంవిధాన్ దివస్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కారుకూరి చంద్రమౌళి, ప్రోగ్రాం చైర్మన్ మదుసూదన్‌రెడ్డి, కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, ఇన్‌ఛార్జి హెడ్‌మాస్టర్ సాంబయ్య పాల్గొన్నారు. బీఎస్పీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో నాయకులు రాజేంద్రప్రసాద్, కారాను రవీందర్, శ్రీనివాస్, కిరణ్‌బాబు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: పట్టణంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సంఘం మండల అధ్యక్షుడు ముల్కల రాందాస్, సభ్యులు లింగయ్య, సాగర్, మేకల బానేష్, జంగు, నవీన్, రమేష్, దిలీప్ పాల్గొన్నారు.

కాసిపేట: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీవో షేక్ సప్దర్‌అలీ, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో మున్సిపల్ కమిషనర్ రాజలింగు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జన్నారం: మండలంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. పొన్కల్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు మువ్వన్నెల జెండాతో రాజ్యాంగ పీఠికను పఠించారు.

- ఎన్నికల నోటిఫికేషన్ విడుదలతో గ్రామాల్లో మొదలైన సందడి
- గెలుపు గుర్రాల వేటలో ప్రధాన పార్టీలు
- సర్పంచ్, వార్డు సభ్యుల పోటీకి ఆశావహుల ఏర్పాట్లు
- మద్దతుదారులతో సమాలోచనలు



జిల్లాలో పల్లె పోరుకు ఆశావహులు సిద్ధమయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక మొదటి పంచాయతీ ఎన్నికలు కావడంతో అధికార పార్టీ నాయకులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారు. దీంతో పల్లెల్లో ఎన్నికల వేడి రాజుకుంటోంది.

ఆసిఫాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ మంగళవారం విడుదల కావడంతో గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది. పోటీ చేయాలన్న ఆశావాహులు ముందుగా తమ మద్దతు దారులతో సమాలోచనలు సాగిస్తున్నారు. తాము పోటి చేస్తే ఎలా ఉంటుంది.. అందరి మద్దతు లబిస్తుందా లేదా అనే విషయాలపై ఆరా తీస్తున్నారు. ఎక్కడ ఏ ఇద్దరు కలిసిన గ్రామాలలో ఏ పార్టీ మద్దతుతో ఎవరు పోటికి సిద్ధమవుతున్నారనే అంశాలపై చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా జనరల్ స్థానాల్లో పోటీ తీవ్రంగా ఉండనుంది.

15 మండలాల పరిధిలో..

ఆసిఫాబాద్ జిల్లాలోని 15 మండలాల్లో మొత్తం 335 గ్రామపంచాయతీలు, 2,874 వార్డు స్థానాలకు మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందులో సర్పంచ్ స్థానాలకు ఎస్టీలకు 198, ఎస్సీలకు 32, బీసీలకు 20, జనరల్ కేటగిరిలో 85 కేటాయించారు. అలాగే వార్డు స్థానాలకు ఎస్టీలకు 1292, ఎస్సీలకు 226, బీసీలకు 231, జనరల్‌కు 1125 రిజర్వేషన్లు కేటాయించడం జరి గింది. దీంతో పల్లెల్లో రిజర్వేషన్ అనుకూలించిన వారు ఎన్నికల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు పోటి చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొవాలనే ఆలోచ నతో చాలా మంది పోటికి సిద్దంగా ఉన్నట్లు తెలుస్తొంది. మరోపక్క ఒకే పార్టీకి చెందిన మద్ద తు దారులు ముగ్గురు, నలుగురు సర్పంచ్ స్థానా లను ఆశిస్తుండడంతో తీవ్ర పోటి నెలకొంది. ఈ ఎన్నికల్లో పార్టీ గుర్తు ఉండదు కనుక పోటీదా రులకు ఎవరు మద్దతు ఇస్తే వారే గెలిచే అవకా శాలు ఉన్నాయి.

నిధుల సమీకరణ..

పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధం గా ఉన్న ఆశావాహులు నిధుల సమీకరణ చేసే పనిలో పడ్డారు. సర్పంచ్ స్థానాలకు గ్రామాల్లో తీవ్ర పోటీ నెల కొన్నది. ఈ నేపథ్యంలో ఎలాగైనా పదవిని చేజిక్కించుకొవాలని పోటీదారులు కసరత్తు ముమ్మరం చేశారు. దీంతో పోటీ చేయడానికి ఆసక్తి ఉన్న అభ్యర్థులు నిధుల సమీకరణలో నిమగ్నమయ్యారు. అవసరం మేర డబ్బు సమకూ ర్చుకునే పనిలో పడ్డారు. మద్దతుదారులను ప్రస న్నం చేసుకునేందుకు మందు, విందులు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పల్లెల్లో రాజకీయ సందడి నెలకొన్నది.

అభ్యర్థుల వేటలో..

పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ప్రధాన పార్టీలు గెలుపు గుర్రాల కోసం వేట మొదలు పెట్టాయి. సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థుల ఎంపికపై అధికార పార్టీ కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీలతో పాటు వివిధ పార్టీల ఆది నాయకులు అచితూచి వ్యవహరిస్తున్నారు. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగా జరుగుతున్న తొలి స్థానిక సంస్థల ఎన్నికలపై ద్వితీయ శ్రేణి నాయకులు భారీ ఆశలు పెట్టుకున్నారు. బరిలో నిలిచే ఆయా పార్టీలకు చెందిన ఆశావాహులు అధిష్ఠానం, ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ తదితర పార్టీల అభ్యర్థులను ఎవరిని ఎంపిక చేయాలని అంశంపై మండల పార్టీ ప్రతినిధులు, గ్రామాల నేతలతో సమాలోచనలు చేస్తున్నారు.

ముగిసిన వైజ్ఞానిక ప్రదర్శనలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న వైజ్ఞానిక ప్రదర్శనలు బుధవారం ముగిశాయి. ఉత్తమంగా ఎంపికైన ప్రదర్శనలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయికి 35 ప్రదర్శనలు ఎంపిక కాగా ప్రొఫెసర్ శంకర్, కో కన్వీనర్ దేవాజీ, జిల్లా సైన్స్ అధికారి మధుకర్, ఎస్వో శ్రీనివాస్‌లు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. బాల వైజ్ఞానిక ప్రదర్శనలో 280 మందికి గాను 21 మంది రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఇన్‌స్పైర్ మనాక్ ప్రాజెక్టుల్లో 120 మందికి గాను 12 మంది ఎంపిక కాగా సైన్స్ సెమినార్‌లో ఒకరు, టీఎల్ఎంలో ఒకరు రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు తెలిపారు.

డిసెంబరు 1 నుంచి డిప్లొమా పరీక్షలు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డిసెంబరు 1వ తేదీ నుంచి 2024-25 బ్యాచ్ డీఈఐఈడీ డిప్లొమా అభ్యర్థులకు మొదటి సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నామని అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి డీఈవో దీపక్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పరీక్ష నిర్వహణకు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నామని తెలిపారు. అభ్యర్థులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

కార్మిక చట్టాలను రద్దు చేయాలి

రెబ్బెన, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా తీసుకు వచ్చిన జీవోను రద్దు చేయాలని కోరుతూ బుధవారం బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డిని ఐఎన్‌టీయూసీ నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్మికులకు ఇబ్బంది కలిగే చట్టాలను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మాదవ కృష్ణ, భాస్కరచారి, భీమేష్, శ్రీనివాస్, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

ఆసిఫాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుముదిని అన్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి అదనపు కమిషనర్ మంద మకరందు, పంచాయతీ రాజ కమిషనర్ సృజన, అదనపు డీజీపీలు మహేష్‌భగవత్, డీఎస్ చౌహాన్‌లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్‌లు, ఎస్పీలు, అదనపు కలెక్టర్, అదనపు ఎస్పీలతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో తీసుకోవాల్సిన చర్యలు, ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను మూడు విడతలలో నిర్వహించనున్నామని చెప్పారు. మొదటి విడత ఎన్నికల నామినేషన్లు ఈ నెల 27 నుంచి ఫాం 1 నోటీసు జారీ చేసి ఉదయం 10.30 గంటలకు స్వీకరించాలని తెలిపారు. నామినేషన్ ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేయాలని, స్టాటిస్టిక్ సర్వేయలెన్స్ టీం, ఫ్లయింగ్ సర్వేయలెన్స్ టీంలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలు పర్చాలన్నారు. ఎంసీఎంసీ కమిటీ మీడియా సెంటర్, కంట్రోల్ రూంలను ఏర్పాటు చేయాలని సూచించారు.. ఎన్నికలను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీసీ హాల్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా ఎస్పీ నితికా పంత్, అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, అదనపు ఎస్పీ చిత్తరంజన్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీపీవో భిక్షపతి, జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 335 గ్రామ పంచాయతీలు 2,874 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు సంతృప్తికరం



మాట్లాడుతున్న లయన్స క్లబ్ జిల్లా గవర్నర్ కోదండరాం

రెబ్బెన, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలంలో గోలేటి లయన్స్ క్లబ్ ఆఫ్ స్పోర్ట్స్ సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని లయన్స క్లబ్ జిల్లా గవర్నర్ కోదండరాం అన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమేశ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను సేవా కార్యక్రమాలను బుధవారం ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోలేటి స్పోర్ట్స్ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేసిన సేవలు ఎంతో సంతోషకరమని అన్నారు. రాబోయే కాలంలో మండలంలో విస్తృతంగా క్లబ్ ఆధ్వర్యంలో విశేష సేవలు చేయాలన్నారు. అనంతరం మాజీ లయన్స క్లబ్ గవర్నర్ నారాయణరెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సన్మానించారు. కార్యక్రమంలో గవర్నర్ నారాయణరెడ్డి, నారాయణరావు, రమేశ్, బాపిరెడ్డి, రాజయ్య, రమేశ్, మహేందర్‌రెడ్డి, చందర, సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

కౌటాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాలకిషన్ రావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఫ్రెషర్స్‌డేలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువులో రాణజంచి ఉన్నతంగా ఎదగాలన్నారు. నేడు మీరు చదివే చదువు మీ భవిష్యత్‌ను నిర్ణయిస్తుందన్నారు. చదువును ఎప్పుడు భారంగా కాకుండా ఇష్టంగా చదివినప్పుడే మనం చదువులో రాణించగలుగుతామని అన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరిం చాయి. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

నేటి నుంచి తొలివిడత నామినేషన్ల స్వీకరణ

బెజ్జూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తొలి విడత పంచాయతీ ఎన్నికలు నిర్వహించే గ్రామాల్లో గురువారం నుంచి తొలివిడత నామినేషన్ల స్వీకరణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో మూడు విడతల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆసిఫాబాద్ నియోజకవర్గానికి చెందిన ఐదు మండలాలు వాంకిడి, కెరమెరి, జైనూరు, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల్లో మొదటి విడతలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఐదు మండలాలకు చెందిన అభ్యర్థులు ఈనెల 27,28,29 తేదీల్లో నామినేషన్లను దాఖలు చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం గడువు విధించింది. అత్యధిక గ్రామాల్లో ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఇంకా ప్రాథమిక దశలో ఉండటం నామినేషన్ దాఖలుకు సమయం కూడా లేకపోవడంతో ఆశావహుల్లో టెన్షన్ నెలకొంది. అయితే 28న అష్టమి, 29న నవమి ఈ రెండు రోజులు శుభసూచికం కాదనే సెంటిమెంట్ చాలా మందిలో సాధారణంగా ఉంటుంది. దీంతో మొదటి విడత ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు నామినేషన్ దాఖలుకు కేవలం 27వ తేదీ ఒక్కటే మిగిలి ఉండటంతో ఉత్కంఠ నెలకొంది. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నుంచి ఆశావహుల సంఖ్య ఒక్కో పంచాయతీ నుంచి ఐదారుగురు ఉండటంతో వాళ్లను బుజ్జగించడం ఆయా పార్టీల నేతలకు తలనొప్పిగా మారింది. నామినేషన్ల దాఖలు ప్రక్రియకు అష్టమి, నవమి దాకా వేచి ఉండకుండా అభ్యర్థులను ఎంపిక చేయాలని అధిష్టానాన్ని ఆశావహులు కోరుతున్నారు. మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ఆశావహుల్లో ఆందోళన మొదలైంది. పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత కేవలం ఒక్కరోజు మాత్రమే గడువు ఉండటంతో నామినేషన్ దాఖలు గురువారం వేస్తేనే బాగుంటుందని పలువురు అంటున్నారు.

మొదటి విడత పంచాయతీలు..

జిల్లాలో మొదటి విడతలో వాంకిడి, కెరమెరి, జైనూరు, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. వాంకిడిలో 28, కెరమెరిలో 31, జైనూరులో 26, సిర్పూర్(యు)లో 15, లింగాపూర్‌లో 14పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. ఆయా మండలాల్లో ఇంకా అభ్యర్థుల ఎంపిక ఖరారు కాకపోవడంతో అధిష్టానాల మద్దతు ఎవ్వరికి ఉంటుందోనని ఆశావహుల్లో ఆందోళన నెలకొంది. నిమినేషన్ దాఖలుకు కూడా సమయం లేకపోవడంతో అభ్యర్థుల ఎంపికపై స్థానిక నాయకులతో మంతనాలు జరుపుతున్నారు. ఇప్పుడు చోటు దక్కని అభ్యర్థులకు రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో స్థానం కల్పిస్తామంటూ ఆశావహులను బుజ్జగిస్తున్నారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలంలో మొదటి విడతగా నిర్వహించనున్న గ్రామ పంచాయతీ సర్పంచ్ వార్డు సభ్యుల ఎన్నికలకు ఏడు నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో జోత్స్న తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఎంపీడీవో విలేకరులతో మాట్లాడారు. వాంకిడి గ్రామ పంచాయతీలో జంబులుధరి గ్రామ పంచాయతీ సభ్యులు నామినేషన్ వేయాలని సూచించారు. బెండార గ్రామ పంచాయతీలో బెండారతో పాటు జైత్‌పూర్, సామల, సవ్వాతి, పాపరగొంది గ్రామ పంచాయతీల్లోని అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఇందాని గ్రామ పంచాయతీలో కిర్డి, నవేగూడ, నవేగాం, ఖమన గ్రామ పంచాయతీలో లక్ష్మీపూర్, వెలిగి, నర్గం, కోమటిగూడ గ్రామ పంచాయతీలో దొడ్డిగూడ, చిచ్చుపల్లి గ్రామ పంచాయతీలు, వార్డు సభ్యులు నామినేషన్ వేయాలని సూచిచారు.

సర్పంచ్‌గా నామినేషన్ నియమాలు

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల్లో నామినేషన్ వేసే వ్యక్తులు 21 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి. అభ్యర్థి ప్రతిపాదకుడు సంతకం చేసిన నామినేషన్ ఉదయం 10.30 నుంచి 5 గంటల లోపు సమర్పించాలి. ప్రతిపాదకుడు కచ్చితంగా సంబంధిత వార్డు ఓటర్ లిస్టులో నమోదు అయి ఉండాలి. అభ్యర్థి ఆ గ్రామంలో ఓటరుగా నమోదు అయి ఉండాలి. అభ్యర్థి ప్రతిపాదకుడు ఇంటి టాక్స్ కట్టి గ్రామపంచాయతీ నుండి నో డ్యూ సర్టిఫికెట్ తీసుకోవాలి. డిపాజిట్ రుసుము సర్పంచ్ 2000 అభ్యర్థికి వార్డు అభ్యర్థికి 500 ఎస్సీ, ఎస్టీ, బీసీలు కుల ధ్రువీకరణ ఇవ్వాలి లేదంటే నామినేషన్ ఫారంలోని పార్ట్-111లో డిప్యూటీ తహసీల్దార్ సంతకం చేయించాలి. రిజర్వుడు కేటగిరి అభ్యర్థుల డిపాజిట్ రుసుము సర్పంచి అభ్యర్థికి 1000 వార్డు అభ్యర్థికి 250 ఇద్దరు సాక్షుల స్వీయ ధ్రువీకరణ అన్ని గడులు పూరించి ఇవ్వాలి. రిటర్నింగ్ అధికారి సమక్షంలో ఎన్నికల ఖర్చు ఖాతా నిర్వహిస్తానని చెప్పే డిక్లరేషన్‌పై సంతకం చేసి ఇవ్వాలి, అభ్యర్థి తన గుర్తింపు కార్డు కోసం ఫోటోను సమర్పించాలి. స్క్రూటినీ రోజున నిర్ణీత సమయానికి రిటర్నింగ్ ఆఫీసర్ ఎదురుగా హాజరు కావాల్సి ఉంటుంది.

ముమ్మరంగా వరి కోతలు



ఆరబోసిన ధాన్యం

దహెగాం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వానాకాలంలో సాగు చేసిన వరి కోతలు జోరుగా కొనసాగుతున్నాయి. రైతులు హార్వేస్టర్‌లతో వరి కోతలు చేపడుతు న్నారు. గత పక్షం రోజులుగా జిల్లా వ్యాప్తంగా వరి కోతల్లో రైతులు, కూలీలు బీజీగా గడుపుతున్నారు. సుమారు మరో నెల రోజుల పాటు కోతలు సాగే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 15 మండలాల పరిధిలో రైతులు ప్రాజెక్టులు, కుంటలు, చెరువులు, వ్యవసాయ పంపు సెట్లు, నీటి వనరులు లభించే ప్రాంతాల్లో వరి పంటను సాగు చేశారు. సన్నరకం వరి ధాన్యాన్ని అధిక విస్తీర్ణంలో రైతులు సాగు చేశారు. జిల్లాలోనే దహెగాం మండలంలో అత్యధికంగా 9,820 ఎకరాల్లో వరి పంట సాగు చేయగా జిల్లా వ్యాప్తంగా 56 వేల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేశారు. ఇందుకు గాను జిల్లాలో 40 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఐకేపీ, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా వరి కొనుగోలు చేపట్టనున్నారు. ఏ గ్రేడ్ రకానికి రూ.2,389, బీ గ్రేడ్ రకానికి రూ.2,369 మద్దతు ధర చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేయనుంది.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాం..

దహెగాం, మండల కేంద్రంలో, అయినం గ్రామంలో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాం. జిల్లాలో 40 కొనుగోలు కేంద్రాల ద్వారా 45 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడం లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ అందజేస్తోంది. రైతులు కొనుగోలు కంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి.

- బి.వెంకటి, జిల్లా వ్యవసాయాధికారి

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శ్రీ హరిహర అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం సుబ్రమణ్యస్వామి షష్టి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేడకల్లో ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. షష్టి వేడుకల్లో భాగంగా స్వామి వారికి ఆలయ అర్చకులు నాగేశ్వర్ పుణ్యాహవచనం, గణపతి పూజ, అభిషేకం, మంగళహారతి, మంత్ర పుష్పాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తలకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో స్వాములు ఆశిష్, శ్రీధర్, కేదారి, పతాప్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి రాజ్యాంగం అవసరం



కాగజ్‌నగర్‌లో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సిబ్బంది



ఆసిఫాబాద్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి రాజ్యాంగం అవసరమని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకని బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి అదనపు కలెక్టర డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, జిల్లా అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ భారత దేశ పౌరులు తమ హక్కులతో ప్రశాం తంగా జీవించడానికి భారత రాజ్యాంగం మార్గదర్శకమని అన్నారు. భారత రాజ్యాంగ విలువలు, ప్రాథమిక హక్కులు, పౌర హక్కులు, కర్తవ్యాలు, ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి రాజ్యాం గం ఎంతో ఆవశ్యమని తెలిపారు. ప్ర పంచంలోనే అతి పెద్ద ప్రజా స్వామ్య వయవస్థ కలిగిన మన దేశంలో వ్యవస్థను నిర్వహించడం మన దేశ రాజ్యాంగం అత్యంత కీలకమైందని తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ, దేశాభివృద్ధికి కట్టుబడి పని చేయాలన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని, ప్రజా సేవలో క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లాలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపాలీలో బుధవారం రాజ్యాంగ అవతరణ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ రాజేందర్ పూల మాల వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ కర్త అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో మేనేజర్ మల్లయ్య, మెప్మా స్టాఫ్ నారాయణ, శంకర్, రఫీక్, ఉసా, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండిబాగూడ, జైనూర్ తదితర గ్రామాల్లో బుధవారం 76వ రాజ్యాంగ దినోత్సవాన్ని ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్, సహకార చైర్మన్ కొడప హన్ను పటేల్ తదితరులు అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇంతీయాజ్ లాల, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్‌అబ్దుల్ ముకీద్, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కాంబ్లే బాబా సాహెబ్, నాయకులు కాంబ్లే నాగోరావ్, మవాలె దత్తాత్రి, కోటంబే శ్రీహరి గరుడ్‌కర్ కేశవ్, కాంబ్లే అన్నారావ్, గాయక్ వాడ్ సతీష్, బి. వెంకటి పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ వద్ద రాజ్యాంగ దినోత్సవం సంతర్భంగా ఏర్పాటు చేసిన మాలల ఆత్మీయ సమ్మేళనంలో జాతీయ అధ్యక్షుడు రామ్మోహన్ మాట్లాడారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు యశోద, వరంగల్ మహిళా అధ్యక్షురాలు త్రివేణి, చైర్మన్ అధ్యక్షురాలు నరసింహా, జాతీయ కార్యదర్శి యాదగిరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధవిహార్‌లో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, సందీప్, దుర్గాజీ, విజయ, రోషన్, శ్యాంరావు తదితరులు పాల్గొన్నారు.